అడవుల్లో జూదం ఆనవాళ్లు



మహాముత్తారం మండలంలోని అడవులు జూదానికి నిలయంగా మారాయి. అడవుల్లో వాగులు, చెట్ల మధ్య జోరుగా జూదం నిర్వహిస్తున్నట్లు ఆనవాళ్లున్నాయి. మండలంలోని జీలపల్లి సమీపంలో అటవీ ప్రాంతంలోని గంధపుచెక్కల వాగులో రోడ్డు నుంచి సుమారు 300 మీటర్ల దూరంలో జూదం ఆడి పడేసిన ముక్కలు కనిపించాయి. ఖాళీ అయిన మద్యం బాటిళ్లు సైతం దర్శనమిస్తున్నాయి.

–న్యూస్‌టుడే, మహాముత్తారం(భూపాలపల్లి జిల్లా)

పాలనాధికారిని కలిసిన పల్లుగ వాసులు

కాళేశ్వరం, న్యూస్‌టుడే : మారుమూల ప్రాంతమైన పల్లుగలపై దృష్టి సారించాలని జిల్లా పాలనాధికారి రాహుల్‌శర్మను పల్లుగ వాసులు కోరారు. మంగళవారం ఆయన్ను క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలపై ఏకరవు పెట్టారు. పల్లుగ వరకు రహదారి పూర్తిగా చెడిపోయిందని, వెంటనే మరమ్మతు చేపట్టేలా కృషి చేయాలని, నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి మెరుగైన సరఫరా అందేలా చూడాలని, గోదావరి వద్ద పుష్కర ఘాట్ నిర్మాణాలు చేయాలని వినతిపత్రం సమర్పించారు. పాలనాధికారి సానుకూలంగా స్పందించినట్లు మచ్చ మహేశ్, ఒద్ది చంద్రు, రాజయ్య, పలువురు తెలిపారు.

కిక్కెక్కుతున్నా.. కిక్కురుమనట్లే..

విచ్చలవిడిగా గొలుసు దుకాణాలు

జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది.. పలు కార్మిక కాలనీలతో పాటు పల్లెల్లోనూ వాడవాడలా పెద్ద మొత్తంలో గొలుసు దుకాణాలు ఏర్పాటు చేస్తూ అమ్మకాలు జరుపుతున్నారు.. భూపాలపల్లి పట్టణంలోని కొన్ని వీధుల్లో 24 గంటల పాటు లభించే అడ్డాలున్నాయంటే వ్యాపారం ఎంతలా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.. తెల్లవారుజామున మొదలుకొని అర్ధరాత్రి వరకు ఈ తంతు సాగిస్తున్నారు. ఒక సమయం వరకు ఒక ధర.. అంతకుమించితే మరో రేటుతో విక్రయిస్తున్నారు. కళ్లెదుటే వ్యవహారం సాగుతున్నా కట్టడి చేయాల్సిన అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

–న్యూస్‌టుడే, భూపాలపల్లి



కోల్‌బెల్ట్ ప్రాంతంలో..

జిల్లాలో ఏకైక భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలోని కోల్‌బెల్ట్ ప్రాంతంతో పాటు జిల్లాలోని 11 మండలాల్లోని 240 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 31 వరకు మద్యం దుకాణాలు, జిల్లా కేంద్రంలో రెండు బార్లు ఉన్నాయి. వీటి ద్వారా పెద్ద మొత్తంలో వ్యాపారం సాగుతోంది. వీటికి పదింతలకు పైగానే బెల్ట్‌షాపులు నడుస్తున్నాయి. ఇక్కడ ప్రత్యేకంగా సిట్టింగ్ కోసం షెడ్లు ఏర్పాటు చేసి బహిరంగంగానే అమ్మకాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.. కొన్నిచోట్ల చీప్ లిక్కర్ నుంచి నాణ్యమైన బ్రాండ్లు లభించడం చూస్తుంటే విక్రయాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. మద్యం దుకాణాలు దక్కించుకున్న కొందరి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి వీరే ఉదయం, సాయంత్రం పూట నాలుగు ట్రాలీ ఆటోల ద్వారా పట్టణంలోని పలు కార్మిక కాలనీల్లో, గ్రామాల్లోని బెల్ట్‌షాపులకు మద్యాన్ని దర్జాగా సరఫరా చేస్తున్నారు.

అధిక ధరలకు..

మద్యం దుకాణాల్లో అసలే అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటుండగా.. బెల్ట్‌షాపుల్లో క్వార్టర్ మందుపై ఏకంగా రూ.40 నుంచి రూ.50 వరకు పెంచి వసూలు చేస్తున్నారు. జాతర జరిగే ప్రాంతాల్లోనైతే మరీ ఎక్కువగా దండుకుంటున్నారు. మద్యం దుకాణాలకు సెలవు వస్తుందని తెలిస్తే ముందస్తుగా భారీ మొత్తంలో నిల్వ చేసి, ఒక్కో సీసాపై రూ.50కి పైగా పెంచి అమ్మకాలు చేస్తున్నారు. అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలు బంద్ చేస్తారు. కానీ, బెల్ట్‌షాపుల్లో మాత్రం విచ్చలవిడిగా అమ్మకాలు జరిగాయి. కొన్ని చోట్ల మద్యాన్ని కల్తీ సైతం చేస్తున్నారు. భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీ ప్రాంతంలోనే మద్యాన్ని కల్తీ చేస్తూ.. అదే మద్యాన్ని కొన్ని మద్యం దుకాణాలకు, బెల్ట్‌షాపులకు సిండికేట్ సిబ్బంది సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. స్పిరిట్, నీళ్లు వంటి వాటిని కలపడంతో ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారు. ఇదంతా బాహాటంగా సాగుతున్నా.. నియంత్రించాల్సిన సదరు ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.



గ్రామాల్లో బెల్ట్‌షాపులకు మద్యాన్ని ఆటోలో సరఫరా చేస్తున్న సిండికేట్ సిబ్బంది

మచ్చుకు కొన్ని..

☛ జిల్లా కేంద్రంలోని కారల్‌మార్క్స్‌కాలనీ ప్రాంతంలోని అయ్యప్పస్వామి, సాయిబాబా, వెంకటేశ్వర స్వామి ఆలయాలకు అతి సమీపంలోనే ఆరు నుంచి ఎనిమిది వరకు బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. ఈ బెల్ట్‌షాపులు తొలగించాలని పలుమార్లు భక్తులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు.

☛ జాతీయ రహదారికి ఆనుకొని పట్టణంలోని సీఆర్‌నగర్, బాంబులగడ్డ ప్రాంతాల్లో ఐదు నుంచి ఆరు వరకు బెల్ట్‌షాపులు ఉన్నాయి. వీటి ఎదురుగానే సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 2 గంటల వరకు బొగ్గు, ఇసుక రవాణా లారీలు నిలుపుదల చేస్తూ, మద్యం తాగుతున్నారు. జాతీయ రహదారిపై లారీలు నిలుపుదల చేయడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

☛ మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు, వేశాలపల్లి, కాశీంపల్లి, పుల్లూరిరామయ్యపల్లి తదితర శివారు గ్రామాల్లో పదుల సంఖ్యలో గొలుసు దుకాణాలు కొనసాగుతున్నాయి. వీటిని తొలగించాలని ఆయా గ్రామాల మహిళలు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

అద్దె బకాయిలు.. గురుకులాలకు తాళాలు!

జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలకు ఇంటి యజమానులు మంగళవారం గేట్లకు తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీంతో దసరా సెలవుల అనంతరం పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు బయటే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది..

–న్యూస్‌టుడే, టేకుమట్ల – భూపాలపల్లి, రేగొండ

జిల్లాలోని భూపాలపల్లి, రేగొండ, గణపురం, కాటారం, మొగుళ్లపల్లి మండలాల్లో గురుకుల పాఠశాలలు కొనసాగుతున్నాయి. అందులో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బాలుర మైనార్టీ గురుకుల పాఠశాల, రేగొండలోని మహాత్మా జ్యోతిబా పులే బాలుర, లింగాల క్రాస్ రోడ్డులో బాలికల, కాటారంలోని బాలుర గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి కొన్ని నెలలుగా బిల్లులు అందడం లేదు. రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు బకాయిలు ఉన్నాయి. దీంతో భవనాల యజమానులు తాళాలు వేసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. దసరా సెలవులు ముగించుకొని పాఠశాలలకు వస్తున్న విద్యార్థులు తాళాలు వేసి ఉన్న పాఠశాలలను చూసి ఆందోళన చెందుతున్నారు.



లింగాల క్రాస్ రోడ్డు ఎంజేపీ పాఠశాల వద్ద..



గేటు బయటే పడిగాపులు..

గేటుకు తాళం వేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది బయటే నిరీక్షిస్తున్న చిత్రం రేగొండ మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర వసతి గురుకుల పాఠశాలలోనిది.. ఓ ప్రైవేటు పాఠశాలను అద్దెకు తీసుకొని ఎంజేపీ బాలుర వసతి గృహంగా నడిపిస్తున్నారు. పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం రూ.11 లక్షల అద్దె బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు యజమాని కటకం రాజు పేర్కొన్నారు. గేటుకు తాళం వేసిన విషయాన్ని తెలుసుకున్న బీసీ సంక్షేమ జిల్లా అధికారి శైలజ హాజరై యజమానితో మాట్లాడి తెరిపించారు.



రెండు గంటల పాటు..

పాఠశాల ముందు కూర్చొని నిరీక్షిస్తున్న వీరు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర మైనార్టీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో మూడేళ్ల క్రితం ఓ ప్రైవేటు భవనంలో విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అద్దె చెల్లించడం లేదనే కారణంతో మంగళవారం పాఠశాల గేటుకు అద్దె భవనం యజమాని నాగుల దేవేందర్‌రెడ్డి తాళం వేశారు. ఉపాధ్యాయులు పాఠశాల ముందు చెట్టుకింద దాదాపు రెండు గంటల పాటు నిరీక్షించారు. విద్యార్థులు వచ్చి వెనుదిరిగారు. పాఠశాలలో దాదాపు 480 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ జిల్లా అధికారి శైలజ, ఆర్డీవో మంగీలాల్ ఇంటి యజమానితో మాట్లాడి తాళం తీయించారు.

గేట్లకు తాళాలు తెరిపించాం

–శైలజ, బీసీ సంక్షేమ జిల్లా అధికారి, భూపాలపల్లి

అద్దె భవనాల యజమానులు బిల్లుల కోసం గేట్లకు తాళాలు వేశారనే విషయం తెలియగానే ఆయా పాఠశాలల వద్దకు వెళ్లాను. యజమానులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న బిల్లుల గురించి తెలుసుకొని ఎంజేపీ, మైనార్టీ పాఠశాలల ప్రిన్సిపల్ సెక్రటరీల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చి, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరాం. దీంతో నిరసన విరమించుకొని గేట్లకు తాళాలు తీశారు.

నేటి నుంచి జోనల్ స్థాయి పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ : సింగరేణి పరిరక్షణలో ప్రధాన భూమిక పోషిస్తున్న రెస్క్యూ సభ్యులకు నేటి నుంచి రెండు రోజులపాటు ప్రతిభ పరీక్షల నిర్వహణకు సింగరేణి యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆర్జీ-2 డివిజన్‌లోని మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో బుధవారం సంస్థ సంచాలకులు వెంకటేశ్వర్ రెడ్డి, మరో అధికారి ఉమేష్ సావర్కర్ ఈ పోటీలను ప్రారంభించనున్నారు. 17న రెస్క్యూ స్టేషన్ ఆవరణలో నిర్వహించే ముగింపు కార్యక్రమానికి సంస్థ సీఎండీ బలరాం, భారత బొగ్గు గనుల భద్రత విభాగం ముఖ్య అధికారి భూషన్ ప్రసాద్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సింగరేణి వ్యాప్తంగా 11 డివిజన్ల నుంచి 6 జట్లు పాల్గొనగా.. ఈ పోటీలను వీక్షించడానికి కార్మికులు వారి కుటుంబసభ్యులు రావాలని జీఎం శ్రీనివాస్ కోరారు.

ఆర్టీసీ పండగ చేసుకుంది..!

● 14 రోజుల్లో రూ.28.99 కోట్ల ఆదాయం



దసరా ఆర్టీసీ కలిసొచ్చింది. పెద్ద ఎత్తున ప్రయాణికులను చేరవేసి అదనపు ఆదాయాన్ని సంపాదించుకుంది. గతంలో పండగ సమయంలో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేసేవారు. ఈసారి హైదరాబాద్ రూట్‌లో మాత్రమే ప్రత్యేక ఛార్జీలు పెట్టారు. అయినప్పటికీ అంచనా ప్రకారం అనుకున్న ఆదాయం రాబట్టింది. అక్టోబర్ 2 నుంచి పాఠశాలలు, 4 నుంచి కళాశాలలకు సెలవులు ప్రకటించడం, మహాలక్ష్మి పథకం అమల్లోకి రావడంతో మహిళలు ఉచిత ప్రయాణం చేయడం లాంటి కారణాలతో అనుకున్న లక్ష్యం చేరుకుంది..

–హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే

- వరంగల్ రీజియన్‌లో వరంగల్ 1, వరంగల్ 2, హనుమకొండ, భూపాలపల్లి, పరకాల, జనగామ, మహబూబాబాద్, తొర్రూరు, నర్సంపేట డిపోలు ఉన్నాయి.
- అక్టోబర్ 1 నుంచి 14 వరకు 850 ప్రత్యేక బస్సులు నడిపించారు.
- 14 రోజుల్లో 20 లక్షల నుంచి 25 లక్షల మంది ప్రయాణించారు..
- మొత్తం 50 లక్షల కిలోమీటర్లు తిరిగి రూ.28.99 కోట్ల ఆదాయం సంపాదించారు. గతేడాది 13 రోజుల్లో రూ.19 కోట్ల ఆదాయమే వచ్చింది.



హనుమకొండ ప్రధాన బస్టాండులో ప్రయాణికుల రద్దీ

దూర ప్రాంతాలకు

రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి హైదరాబాద్, బెంగళూరు, పుణె, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపించారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని ఎక్కువగా వినియోగించుకున్నారు. పండగకు ముందు మూడు రోజులు, తర్వాత రెండు రోజులు అంతర్రాష్ట్ర సర్వీసుల్లో ఎక్కువ మంది ప్రయాణించారు.

అధికారుల ప్రత్యేక దృష్టి

తిరుగు ప్రయాణంలో భాగంగా ఈ నెల 13, 14 తేదీల్లో ఆర్టీసీ రీజియన్ అధికారులు హైదరాబాద్, ఉప్పల్ ప్రాంతాల్లో ఉండి రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన బస్ స్టేషన్లలో డిపో మేనేజర్లు పర్యవేక్షించారు.

డిపోల వారీగా వివరాలు

● డిపో	● ఆదాయం(రూ.కోట్లలో)	● తిరిగిన కి.మీ(లక్షల్లో)	● ఓ.ఆర్ (శాతం)
హనుమకొండ	3.73	6.72	81
జనగామ	3.38	6.16	94
వరంగల్ 1	4.67	7.82	83
వరంగల్ 2	3.93	7.16	86
మహబూబాబాద్	2.03	3.46	103
నర్సంపేట	2.84	4.92	96
పరకాల	2.23	3.79	98
తొర్రూరు	3.29	5.52	104
భూపాలపల్లి	2.85	4.75	97

సిబ్బంది, అధికారుల కృషి వల్లే..

- విజయభాను, ఆర్టీసీ రీజనల్ మేనేజర్, వరంగల్ రీజియన్



ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాం. ఆర్టీసీ కార్మికులు, అధికారులు సమష్టి కృషి ఫలితంగా అనుకున్న మేరకు ఆదాయాన్ని తీసుకొచ్చాం. ప్రయాణికులు ఎక్కువగా ఆదరించారు. మరో రెండు రోజుల పాటు రద్దీ కొనసాగనుంది. లోటుపాట్లను సవరించుకొని సేవలు అందిస్తాం.

కేటీపీపీ సీఈతో భేటీ




చెల్పూర్, న్యూస్‌టుడే: కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్(కేటీపీపీ) నూతన సీఈ శ్రీప్రకాశ్‌ను మంగళవారం తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు కార్మిక సంఘం హెచ్ 58 యూనియన్ జెన్‌కో అధ్యక్షుడు రఘోత్తం ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ అండ్ ఎం కార్మికులకు పదోన్నతులు కల్పించి ఆర్టిజన్ కార్మికులకు యూనిఫాం, రెయిన్ కోట్, సీనియారిటీ తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకులు లింగంపల్లి రాజేశ్వర్‌రావు, మల్లిక్, ఆర్టిజన్ కార్మికులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల అమలుపై పర్యవేక్షణ

మంగపేట : కేంద్ర పథకాల అమలు తీరును పలు గ్రామాల్లో నేషనల్ లెవెల్ మానిటరింగ్(ఎన్ఎల్ఎం) బృందం పర్యవేక్షించింది. మండలంలోని నర్సింహసాగర్, చెరుపల్లి గ్రామ పంచాయతీలను ఎంపిక చేసుకొని కేంద్ర పథకాలు ఎలా అమలవుతున్నాయని పరిశీలించారు. ఇందులో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్, సెర్ప్ కార్యకలాపాలు, పింఛన్ల గురించి తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎల్ఎం టీమ్ అధికారి రాజేశ్, జిల్లా అధికారి, ఈజీఎస్ ఏపీడీ వెంకటనారాయణ, సెర్ప్ ఏపీడీ వేణు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బద్రూ, ఏపీఎం అంకూస్, మండల పంచాయతీ అధికారి శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విధుల్లోకి కొత్త ఉపాధ్యాయులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ నియామక ప్రక్రియ వేగవంతంగా పూర్తయింది.. అభ్యర్థులకు నియామక పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అందజేయగా.. మంగళవారం పాఠశాలల కేటాయింపునకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ నెల 16న(బుధవారం) ఉదయం అభ్యర్థులు వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 212 మంది కొత్త ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఇకపై జిల్లాలో పాఠశాలలు కొత్త కళను సంతరించుకోనున్నాయి. ప్రభుత్వం డీఎస్సీ పరీక్ష నిర్వహించిన అనంతరం 61 రోజుల్లోనే ఫలితాలు ప్రకటించింది. ఈ నెల 2 నుంచి 5 వరకు 1:3 నిష్పత్తిలో ధ్రువపత్రాలను పరిశీలించి, 8న అభ్యర్థులను ఎంపిక చేసింది. ఈ నెల 9న ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు తరలించి, సీఎం చేతులమీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ నెల 10న 147 మంది ఎస్జీటీలు, 65 మంది స్కూల్ అసిస్టెంట్లు డీఈవో కార్యాలయంలో రిపోర్టు చేశారు. అదే రోజు నుంచి వారి సర్వీసు లెక్కలోకి వచ్చినట్లు విద్యాశాఖ ప్రకటించగా.. వేతనం కూడా అప్పటి నుంచే లెక్కగట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఎంపికైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో కౌన్సెలింగ్‌కు హాజరు కాగా, ప్రభుత్వం నుంచి కచ్చితమైన ఆదేశాలు రాలేదని.. వాయిదా పడిందని కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం కావడంతో కొంత సేపు ఆలస్యమైంది. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించి, ర్యాంకుల ఆధారంగా వారు కోరుకున్న పాఠశాలలకు కేటాయించారు. ఈ మేరకు కౌన్సెలింగ్ విధానాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పరిశీలించారు. కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తూ, వారిని ఉన్నతమైన స్థానాల్లో ఉండేలా తీర్చిదిద్దాలని డీఈవో రాజేందర్ కోరారు. కార్యక్రమంలో అధికారులు రమేష్, రాజగోపాల్, లక్ష్మణ్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని ఇస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పత్తి కొనుగోలు ప్రక్రియపై మార్కెటింగ్, సహకార, సీసీఐ, పోలీస్, అగ్నిమాపక, వ్యవసాయ, కాటన్ మిల్లుల యజమానులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభమవుతోందని, సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. నవంబర్ మొదటి వారం నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని.. జిల్లాలో 93 వేల ఎకరాల్లో పత్తి సాగు జరిగిందని, అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు సజావుగా, సక్రమంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. జిల్లాలో ఐదు పత్తి మిల్లులు ఉన్నాయని రైతులు విక్రయాలు చేసేందుకు సమీపంలోని మిల్లులకు ట్యాగింగ్ చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన పత్తి నిల్వ ఉంచేందుకు గోదాములు సిద్ధం చేయాలని అన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి కొనుగోలు ప్రారంభించి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పూర్తి చేయాలన్నారు. సీసీఐ ద్వారా తేమ యంత్రాలు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలకు స్టాంపింగ్ చేయాలని ఆదేశించారు. ప్రత్యేక యాప్ ద్వారా రైతుల ఖాతాలో నగదు జమచేసిన వివరాలను తెలుసుకోవచ్చన్నారు. యాప్ గురించి వ్యవసాయ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి కనక శేఖర్, అదనపు ఎస్పీ బోనాల కిషన్, రవాణాశాఖ అధికారి సంధాని, వ్యవసాయశాఖ అధికారి విజయ్ భాస్కర్, జిన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

ఆహారం విలువ తెలిసి.. ఆకలి తీర్చి..

ఒకవైపు ఆకలితో అలమటించేవారు.. మరోవైపు ఆహారం ఎక్కువై వృథా చేస్తున్నవారు మనకు కనిపిస్తుంటారు. ప్రతి మెతుకు నిరుపేదలు, అనాథల కడుపు నింపితే అంతకంటే మేలు మరొకటి ఉండదు. ఈ నిజాన్ని గుర్తించి ఆహారం వృథా కాకుండా అన్నదానం రూపంలో పేదలకు అందజేస్తున్న వారెందరో ఉన్నారు. బుధవారం ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేటి సమాజంలో ఆహారం ఎంత విలువైందో.. దాన్ని వృథా చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

కాజీపేట, శివనగర్, న్యూస్‌టుడే

నేడు ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం





ఆ బాధ తెలుసు కాబట్టే..

- రాందేని ధనలక్ష్మి, శ్రీనివాస్, హనుమకొండ

మా బాబు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స కోసం ఐదునెలలు ఉన్నప్పుడు ఆకలి బాధ తెలిసింది. ప్రతి రోజు ఆహారం పంపిణీ చేసే స్వచ్ఛంద సంస్థలను చూసేవాళ్లం. వారి దాతృత్వం చూశాక ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించాలనిపించింది. ఈ ఆలోచన కరోనా సమయంలో రాగా గురుదక్షిణ నిత్యాన్నదాన సొసైటీ ఏర్పాటు చేసి వరంగల్, హనుమకొండ, కాజీపేట రైల్వే, బస్టాండ్లు, ఫుట్‌పాత్‌లపై ఉండే అనాథలు, మానసిక ఇబ్బందులతో ఉన్న వారికి అన్నదానం చేస్తున్నాం.

లక్షన్నర మందికి

- కొండమీది రాజన్ బాబు, ఉర్సు, వరంగల్

కరోనా సమయంలో ఆకలితో బాధపడుతున్న అనాథలకు అన్నదానం చేయడంతో మొదలైన నా సేవ కన్నతల్లి ఫౌండేషన్ ఏర్పాటుకు దారితీసింది. సంస్థ ద్వారా శుభకార్యాలు, ఫంక్షన్ హాళ్లలో, మిగిలిన ఆహారం సేకరించి శంభునిపేట, వరంగల్ బస్టాండ్, రైల్వేస్టేషన్, వరంగల్ చౌరస్తా, ఎంజీఎం ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్నాను. మిగిలిన భోజనం ఇస్తే మా సంస్థ ద్వారా ప్లేట్లు, గ్లాసులు, తాగునీరు తీసుకెళ్లి అన్నదానం చేస్తున్నాం. ఇప్పటికి లక్షన్నర మందికి అన్నదానం చేశాం.
● ఆహారం మిగిలితే 97017 51278 నెంబరుకు తెలియజేయాలి.



మీకు తెలుసా..

మన ఆహార అలవాట్లు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) నివేదిక పేర్కొంది. వృథా చేయకుండా పర్యావరణ హితంగా ఆహారం తీసుకోవడం వల్ల మన దేశం ఆహార ఉత్పత్తికి ఇతర దేశాలకంటే తక్కువ భూభాగం వాడుతున్నామని చెప్పింది. జనాభా ఎక్కువగా ఉన్నా కేవలం 0.8 శాతం భూమిని మాత్రమే వాడుతున్నాం. చైనా 1.7 శాతం, జపాన్ 1.8, అర్జెంటీనా 7.4 ఆస్ట్రేలియా 6.8, అమెరికా 5.5 శాతం వాడుతున్నాయని నివేదిక తెలిపింది. ● ఉమ్మడి వరంగల్ జిల్లా ఇతర జిల్లాలతో పోలిస్తే ఆహార ఉత్పత్తికి 0.75 శాతం వినియోగిస్తోందని వ్యవసాయ శాఖ తెలిపింది.



పల్లగుట్ట ఉన్నత పాఠశాలలో తిథి భోజనం.. పాఠశాల పరిధిలో ఎవరైనా విద్యార్థులకు ఇలా ఆహారం అందజేస్తారు

లెక్క పెట్టి మరీ..

అమెరికాలాంటి దేశాల్లో శుభకార్యాలు చేయడానికి, ఆహ్వానంతో పాటు గూగుల్ ఫారం కూడా పంపుతారు. ఆన్‌లైన్‌లో శుభకార్యానికి వస్తున్నారా లేదా.. వస్తే ఎంత మంది వస్తారు అనే విషయాన్ని అందులో పొందుపరచాలి. దీన్ని బట్టి వంటలు తయారు చేస్తారు. దీంతో ఆహారం వృథా కాదు. ఇటీవల ఎన్ఐటీ ఆచార్యుడు సి.ప్రసాదు తన కుమారుడి వివాహానికి ఇలాగే ఆన్‌లైన్ ఫారం పంపి దానికి తగినట్లుగా వంటలు చేయించారు.



ఇతర దేశాల్లో..

● ఫ్రాన్స్‌లో మిగిలిపోయిన కూరగాయలు కూడా బయటపడేస్తే నేరంగా భావిస్తారు. వాటిని పేదలకు ఇవ్వాలి. ● నార్వే ఆహార పదార్థాలపై బెస్ట్ బిఫోర్ యూస్ అని ప్రింట్ చేస్తుంది. ఇటలీ, ఫ్రాన్స్, చైనా, అమెరికాలోనూ ఇలాంటి చట్టాలున్నాయి.

అవును.. నిజమే!

● ప్రతిరోజు వరంగల్ మహా నగరపాలక సంస్థ సేకరిస్తున్న వ్యర్థాల్లో సుమారు 40 టన్నులు ఆహార వ్యర్థాలే ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు.
● దేశంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య 14 శాతం ఉంది. వృథా ఆహారం వారికి అందేలా చేయడం ద్వారా వారి శాతం తగ్గించొచ్చు.
● కుళ్లిన ఆహార పదార్థాలను చెత్తకు తరలించడం వల్ల కార్బన్ డై ఆక్సైడ్ కంటే 80 రెట్లు ఎక్కువ శక్తివంతమైన గ్రీన్‌హౌస్ వాయువైన మీథేన్ విడుదలవుతోందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకుందాం

● బంగాళదుంపలు, టమాటాలు, ఉల్లిపాయలు, వెల్లుల్లి, దోసకాయలు ఫ్రిజ్‌లో కాకుండా గది ఉష్ణోగ్రతలోనే నిల్వచేయాలి.
● ఆకుకూర కాడలను నీటిలో ఉంచడం ద్వారా నిల్వ చేసుకోవచ్చు.
● బ్రెడ్ గడువులోగా వాడేయలేమని భావిస్తే ఫ్రిజ్‌లో నిల్వచేయాలి.
● దుకాణం నుంచి ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో వాటి నిల్వ కాలం చూసుకొని తెచ్చుకోవాలి.
● తరచూ ఆహారం మిగులుతుంటే దాన్ని ఫ్రిజ్‌లో పెట్టి ఒక రోజు వాటిని ఉపయోగించేలా ప్రణాళిక వేసుకోవాలి
● పెరటిలోని కూరగాయల మొక్కలకు కంపోస్టు ఎరువుగా వేయడం ద్వారా ఆహార వృథా నివారించవచ్చు.
● ఇంట్లో ఉన్నవారి ఆహార అవసరాన్ని గుర్తించి తయారు చేసుకోవడం, అవసరమైనప్పుడే తయారు చేసుకోవడం వంటి చిట్కాల ద్వారా తగ్గించవచ్చు.
● అదనంగా ఉన్న ఆహారాన్ని దగ్గరి వారికి, పక్క వారికి పంచడం, ఆశ్రమాలకు, అనాథలకు ఇవ్వడం చేయాలి.
● ఆహార బ్యాంకులను ఏర్పాటు చేసి అందులో వేయడం ద్వారా అవసరమైన వారు తీసుకునేలా ఏర్పాట్లు చేయడం.
● ఆహార వ్యర్థాలను తగ్గించడానికి హోటళ్లు, గృహ యజమానులకు ప్రోత్సాహకాలు అందించడం చేయాలి.

పదిహేను సంవత్సరాలుగా

- ఆరుట్ల శ్రీనివాస్, సాయి అమృతహస్తం సంస్థ, వరంగల్

15 ఏళ్ల కిందట గురుపౌర్ణమి నాడు అన్నదానంతో మిగిలిన ఆహారాన్ని అనాథలకు పంపిణీతో మొదలైన నా సేవ ఇప్పటికీ కొనసాగిస్తున్నా. సాయి అమృత హస్తం పేరుతో మిత్రులు పోలా మహేష్, ఎరుకుల్ల నాగేశ్వర్‌రావు, పబ్బ కిషోర్, వేముల శ్రీనివాస్‌తో కలిసి కల్యాణమండపాలు, హోటళ్లు, క్యాటరింగ్ సర్వీసు సెంటర్లలో మా సంస్థ గోడపత్రికలు వేసి, మిగిలిన ఆహారాన్ని మాకు అందించేలా చేస్తున్నాం. అలా నెలలో నాలుగు సార్లు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పంపిణీ చేస్తున్నాం.






నాలుగేళ్లుగా అన్నదానం

- నార్లపురం రాజు

మాది జనగామ జిల్లా పాలకుర్తి. చదువుకోడానికి హనుమకొండకు వచ్చాక ఇక్కడ ఆకలి బాధ తెలిసింది. అడ్వాన్స్‌డ్ లైఫ్ ఫౌండేషన్ సంస్థను ఏర్పాటుచేసి, దాని ద్వారా ఆహారాన్ని ఫంక్షన్ హాళ్ల నుంచి సేకరించి నాలుగేళ్లుగా అనాథలు, ఆశ్రమాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పంపిణీ చేస్తున్నాను.

ఇంటి ఆహారంలోనే..

- డాక్టర్ యాట రోహిత్‌రెడ్డి, వడ్డెపల్లి




ఇంటి ఆహారంలో తాజాదనం ఉంటుంది. ఎక్కువగా నూనెలు వాడకుండా ఉడికించి తింటాం కాబట్టి అందులోని లవణాలు, విటమిన్లు పాడవకుండా ఉంటాయి. వృథా కూడా తక్కువే.. బయటి హోటల్ యజమానులు అమ్ముడు పోని కూరగాయలు వాడుతారు కాబట్టి తాజాదనం తగ్గుతుంది.

ఇలా చేస్తే మేలు..

కార్పొరేషన్ ఆధ్వర్యంలో వృథా ఆహారాన్ని పేదలకు అందించే వ్యవస్థ ఏర్పాటుచేసి ఒక హెల్ప్‌లైన్ నెంబరు ఏర్పాటు చేయాలి. వరంగల్ హెల్పింగ్ హ్యాండ్ చాలెంజ్, సహారా ఫౌండేషన్ సంస్థలు సామాజిక మాధ్యమాల ద్వారా వృథా ఆహారాన్ని సేకరించి అనాథలకు పంచుతున్నాయి. శుభకార్యాల్లో మిగిలిన ఆహారం తీసుకోవడానికి సహృదయ ఆశ్రమం, సాయి అనాథ సేవా ట్రస్టు, ఆరోగ్య సామాజిక సేవా సంస్థ, డాన్‌బాస్కో శివనగర్, హౌజ్ ఆఫ్ జాయ్ ఉంటాయి..

ప్రజల్లో అవగాహన పెరిగింది..

- ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, వరంగల్



ఆహార పదార్థాల వినియోగంపై వరంగల్ ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల మోసాలు జరుగుతున్నాయి. తాము గమనించి కేసులు నమోదు చేస్తున్నాం.

అంకెల్లో వివరాలు..

వరంగల్‌లో ఆహారం వృథా : 18 శాతం

ఇందులో శుభకార్యాల్లో 10

ఇంటిలో..	1
హాస్టళ్లలో..	2
హోటళ్లలో	3
ఇతర	2



రాయితీ రుణం ఇప్పిస్తామని టోకరా

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి రాయితీ రుణం ఇప్పిస్తామని నమ్మించి ఒకరు టోకరా వేసిన ఘటనపై ఆలస్యంగా కేసు నమోదు అయింది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన కొక్కు తిరుపతి చరవాణికి ఈ ఏడాది ఏప్రిల్ 2న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశారు. మీకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం రుణం రూ.10 లక్షలు మంజూరైందని ఒకసారి, రుణం ఇప్పిస్తానని ఒకసారి చెప్పారు. కొంత డబ్బు చెల్లిస్తే రుణం త్వరగా మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని నమ్మించారు. రుణం వస్తుందని ఆశపడిన తిరుపతి గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన ఖాతాకు పలు దఫాలుగా రూ.98,530 ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేశారు. కొద్ది రోజులకు ఆ నెంబరుకు ఫోన్ చేసి ఇంకా రుణం రాలేదని అడగ్గా.. కొంత సమయం పడుతుందని సమాధానం ఇచ్చారు. నెలలు గడిచినా రుణం మంజూరు కాకపోవడంతో అవతలి వ్యక్తికి ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

161 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత



బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సిన రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రాలపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మొత్తం రూ.4.19 లక్షల విలువచేసే 161 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు.. పరకాలకు చెందిన బి.రఘు, ఎస్.ఉప్పలయ్య కలిసి పరకాల చుట్టుపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రాయితీ బియ్యం కొనుగోలు చేసి జ్యోతి రైస్ మిల్లులో నిలువ ఉంచారు. తనిఖీలు నిర్వహించగా సుమారు రూ. 2.63 లక్షల విలువ చేసే 101 క్వింటాళ్ల బియ్యం లభించాయి. నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన ఓదేలు రూ.1.17 లక్షల విలువ చేసే 45 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తూ పట్టుబడ్డారు. నడికూడ మండలం బుడిగజంగాల గ్రామానికి చెందిన తూర్పాటి ఐలయ్య ఇంట్లో రూ.39 వేల విలువ చేసే 15 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, ఆరెస్సై భాను ప్రకాశ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సు ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లా వైద్యారోగ్యశాఖలో గతంలో ఇచ్చిన స్టాఫ్‌నర్సుల నియామక ప్రకటనకు స్పందించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను డీఎంహెచ్‌ఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయం నోటీసు బోర్డులో ప్రదర్శనకు పెట్టినట్లు డీఎంహెచ్‌ఓ డా.వెంకటరమణ తెలిపారు. జాబితాలోని సమాచారంపై అభ్యంతరాలుంటే ఈ నెల 16, 17 తేదీల్లో సాయంత్రం 5 గంటల్లోగా అందజేయాలని కోరారు. ప్రొవిజనల్ మెరిట్ జాబితా కోసం అధికారిక వెబ్‌సైట్ http:///waranagl.telanagana.gov.in చూడాలని సూచించారు.

చెరువు శిఖం.. కబ్జాల పర్వం

● హైడ్రా తరహా ఏర్పాటే శరణ్యం..



ధర్మసాగర్ రిజర్వాయర్‌లో మొరం పోసి చదును చేసిన భూమి



ధర్మసాగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరంలోని చెరువుల్లో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తూ అక్రమ నిర్మాణాలను తొలగిస్తోంది. అలాంటి వ్యవస్థే హనుమకొండ నగరంలోనూ అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరం చుట్టుపక్కల చెరువు శిఖం భూమి కనిపిస్తే చాలు హద్దులు పాతుతున్నారు. ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంకు లెవల్) గుర్తించి, హద్దులు ఏర్పాటు చేయడంలో నీటి పారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీన్ని అక్రమార్కులు అవకాశంగా తీసుకుని యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. కొందరు చెరువు శిఖంలో మొరం పోస్తూ సొంతం చేసుకుంటున్నారు. ఆయా గ్రామాల రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం.



శాయిపేట పాత చెరువులో పోసిన మొరం

● ధర్మసాగర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూమిని ఓ రైతు పట్టా చేసుకుని అందులోని రెండెకరాలను రూ.80 లక్షల చొప్పున ఆరు నెలల కిందట విక్రయించారు. రిజర్వాయర్ చుట్టూ 15 నుంచి 20 ఎకరాల వరకు సమీప రైతులు కొందరు పట్టా చేసుకున్నారు. మరికొందరు ముంపునకు గురైన భూముల్లో మట్టి, మొరం పోసి ఎత్తు పెంచుకొని సాగు చేసుకుంటున్నారు.
● ఎలుకుర్తిలోని సర్వే నెంబర్ 141లో మర్రిచెరువు 40.33 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీని శిఖం ఇప్పటికే 10 ఎకరాల వరకు కబ్జా అయినట్లు సమీప రైతులు ఆరోపిస్తున్నారు.
● పెద్దపెండ్యాలలో మూడేళ్ల కిందట ఓ రైతు కట్టను తొలగించి చెరువు భూమిని తన పొలంలో కలుపుకొనే ప్రయత్నం చేశారు. ఇదే గ్రామంలో మరో చెరువు మత్తడి పోసే చోట మట్టి పోసి నీరు రాకుండా చేశారు.
● శాయిపేట పాత చెరువులో భూమి తన పట్టా స్థలమంటూ మూడేళ్ల కిందట ఓ రైతు చెరువు కట్టను తొలగించి, మొరం పోయించారు. మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు దాన్ని అడ్డుకున్నారు. ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. మొరాన్ని తొలగించలేదు. దీంతో వర్షం నీరు, దేవాదుల పైప్‌లైన్ నీరు చెరువులోకి వచ్చినా కిందకు వెళ్లిపోతున్నాయి.
● జానకీపురం, కేశవనగర్, క్యాతంపల్లిలో కుంటలు కబ్జాకు గురవుతున్నాయి.

హద్దులను నిర్ణయిస్తాం..

- సదానందం, తహసీల్దార్, ధర్మసాగర్

నీటి పారుదల, రెవెన్యూ శాఖల సమన్వయంతో మండలంలోని అన్ని చెరువులు, కుంటలకు హద్దులను నిర్ణయించి, సంరక్షణ చర్యలు చేపడతాం. నీటి పారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్‌ను నిర్ణయిస్తే. . సర్వే చేసి ఆయా సర్వే నెంబర్లకు నాలా కన్వర్షన్లు ఇవ్వకుండా, అక్రమ పట్టా చేసుకోకుండా తగిన చర్యలు చేపడతాం.

మల్లన్న హుండీ ఆదాయం రూ.46 లక్షలు

ఐనవోలు, న్యూస్‌టుడే: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కించారు. ఈ ఏడాది జులై 16 నుంచి అక్టోబర్ 15 వరకు 18 హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మహబూబాబాద్ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ పరిశీలకులు ఎ.అనిల్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. హుండీల ద్వారా రూ.20,73,376, వివిధ సేవల టికెట్ల ద్వారా రూ.25,35,820 కలిపి మొత్తం రూ.46,09,196 ఆదాయం వచ్చినట్లు ఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. బంగారం, వెండి, విదేశీ డాలర్లను తిరిగి హుండీలో వేశారు. మూడేళ్లుగా ఆలయ ఆదాయం గణనీయంగా పెరుగుతూ వస్తోందని ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, ఆర్ఐ మల్లయ్య, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

చరిత్ర తెలుసుకోండి.. వాలంటీర్లుగా నిలవండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ములుగు పాలనాధికారి దివాకర, ఇంటాక్ కన్వీనర్ పాండురంగారావు తదితరులు



శిబిరానికి హాజరైన వాలంటీర్ల బృందంతో అధికారులు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో వచ్చే ప్రతి అవకాశం భవిష్యత్తులో పునాదికి నాంది అని ములుగు జిల్లా పాలనాధికారి టీఎస్ దివాకర అన్నారు. మూడో విడత శిక్షణ శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరూ చరిత్రను తెలుసుకుని చక్కటి వాలంటీర్‌గా నిలవాలని కోరారు. అక్టోబర్ 15 నుంచి 26 వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో జరిగే వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ మూడో శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావుతో కలిసి ప్రారంభించారు. ఐకోమాస్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ టూరిజం, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు భాగస్వామ్యంతో ప్రారంభమైన శిబిరంలో 80 మంది వాలంటీర్లనుద్దేశించి ఆయన మాట్లాడారు. చరిత్ర, కళలు, పురావస్తు, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరు, టూరిజం విభాగాల్లో నైపుణ్యం కలిగిన ప్రొఫెసర్లు చెప్పే తరగతులను అర్థం చేసుకుని క్షేత్రస్థాయిలో తెలుసుకుని సేవ చేయడానికి ఇదొక అరుదైన అవకాశమన్నారు. రాబోయే రోజుల్లో టూరిజం ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని, ఇప్పటి నుంచి అవగాహన పెంచుకుంటే భవిష్యత్తు మీదే అన్నారు. కాకతీయుల ఖ్యాతి ఖండాంతరాలు దాటిందని, దానిని తెలుసుకుని విస్తరించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. సమయం వృథా చేయకుండా.. ప్రతిభ చూపి కాకతీయ ప్రాశస్త్యాన్ని చాటాలని కోరారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఇంటాక్ సూచనలు చేసింది. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి శివాజీ, టూరిజం ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, ఇంటాక్ సభ్యుడు శ్రీధర్‌రావు, అధ్యాపకురాలు శ్రీలత, యోగా గురువు రాంబాబు, ఎంపీడీవో రాజు, పర్యాటక, పురావస్తు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	126
రిటైల్:	148
డ్రెస్డ్:	215
స్కిన్‌లెస్:	244






మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, సమ్మారావు, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, మరో చిత్రంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి,

నూకల నరేష్‌రెడ్డికి నేతల నివాళి

మరిపెడ, న్యూస్‌టుడే: దివంగత కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పురుషోత్తమాయగూడెంకు చెందిన నూకల నరేష్‌రెడ్డి దశదినకర్మ మంగళవారం గ్రామంలోని ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. పలువురు హాజరై ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, శాసనసభ్యులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజకీయ జీవితంతో నరేష్‌రెడ్డితో తమకు ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు.



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు, రఘురాంరెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దయాకర్‌రావు, రావుల శ్రీధర్‌రెడ్డి, బండాప్రకాష్

గ్రంథాలయ నిర్మాణ పనుల పరిశీలన



భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని సోలెట్ కాలనీలో సింగరేణి యాజమాన్యం కేటాయించిన రేకుల షెడ్‌లో కొనసాగుతున్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో ఎన్ని పుస్తకాలు ఉన్నాయి..? రోజుకు ఎంత మంది పాఠకులు వస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కొత్తగా సభ్యుల సంఖ్య పెంచితే భవిష్యత్తులో గ్రంథాలయానికి మనుగడ ఉంటుందని సూచించారు. కొత్త పుస్తకాలు తెప్పించాలని ఆదేశించారు. పన్ను వసూలుపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. అనంతరం పోలీసు స్టేషన్ సమీపంలో సింగరేణి జీఎం కార్యాలయం సమీపంలో రూ.కోటి నిధులతో నిర్మిస్తున్న జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. సంబంధిత గుత్తేదారుతో మాట్లాడి, భవన నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని కోరారు. ఆమె వెంట జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శ్రీలత, సిబ్బంది చంద్రమౌళి, శారద, రవీందర్, రాకేష్, మంజుల పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



చల్లగరిగెలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

చిట్యాల, న్యూస్‌టుడే : గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను నియంత్రించడం సులువు అవుతుందని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. చిట్యాల మండలం చల్లగరిగెలో గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. గ్రామాల్లో ఏదైనా ఘటన జరిగినప్పుడు నిందితులను సులభంగా గుర్తించేందుకు వీలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సై శ్రావణ్‌కుమార్, శిక్షణ ఎస్సైలు మహేశ్, రాజశేఖర్, సిబ్బంది నవీన్, సందీప్, నాగరాజు, నాయకులు అశోక్‌రెడ్డి, నాగరాజు, సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం!

న్యూస్‌టుడే, మహదేవపూర్ (భూపాలపల్లి)

జిల్లాలోని కాటారం డివిజన్‌లోని పలు గ్రామాల్లో ప్రజలకు ఆహ్లాదం, ఆనందం, ప్రశాంత వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో మెరుగైన సదుపాయాల కల్పనకు కసరత్తు చేస్తున్నారు. మహదేవపూర్, కాటారం, మల్హర్, పలిమెల, మహాముత్తారం మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో రిక్రియేషన్ జోన్లు, ఓపెన్ జిమ్‌లు, చిన్నపిల్లలు సరదాగా ఆడుకోవడానికి పార్కులను ఏర్పాటు చేయనున్నారు. ముందుగా మండల కేంద్రాలు, పెద్ద గ్రామాలు, చివరగా చిన్న గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కొన్ని మండల కేంద్రాల్లో నెలకొల్పగా మిగతా ప్రదేశాల్లోనూ సన్నాహాలు చేస్తున్నారు.

మంత్రి ప్రత్యేక దృష్టితో

ఇటీవల మహదేవపూర్ మండల కేంద్రంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పర్యటించగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో సుదీర్ఘంగా చర్చించారు.



మహదేవపూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఓపెన్ జిమ్, పార్కు



మహదేవపూర్ పర్యటనలో కలెక్టర్ రాహుల్‌శర్మతో చర్చిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఐదు మండలాల పరిధిలో పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడానికి యుద్ధప్రాతిపదికన స్థల సేకరణ చేయాలని ఆదేశించారు. ప్రజలకు సౌకర్యవంతంగా, అందుబాటులో, ఉపయోగకరంగా ఉండేలా స్థలాలను త్వరితగతిన గుర్తించి, సేకరించాలని మంత్రి ఆదేశించారు. నియోజకవర్గ నిధులతో ఆయా నిర్మాణాలను చేపట్టనున్నారు. అవసరమైతే ప్రత్యేకంగా నిధులు అందిస్తామని అధికారులకు మంత్రి సూచించారు.

● మహదేవపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల సముదాయ నిర్మాణాలు చిందరవందరగా ఉన్నాయి. సమస్యను ఉపాధ్యాయులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మండల కేంద్రంలో ఒకే పెద్ద నిర్మాణం చేయడానికి ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రూపకల్పన నిపుణుడి ప్రత్యేకంగా పంపించి పరిశీలన చేయనున్నారు. ఆధునిక హంగులు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిర్మాణం చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

ఆలయ పరిసరాల్లో చెత్త తొలగింపు



స్పందనకు వందనం

రేగొండ : కొడవటంచలోని సుప్రసిద్ధ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో చెత్తను సిబ్బంది మంగళవారం తొలగించారు. ఆలయ పరిసరాల్లో నిత్యం భక్తులు పూజల అనంతరం వేస్తున్న చెత్తాచెదారాన్ని సిబ్బంది సరిగా తొలగించడం లేదని భక్తులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకొచ్చారు. విషయాన్ని ఈవో మహేశ్‌కు తెలపడంతో ఆయన స్పందించారు. వెంటనే సిబ్బంది, ట్రాక్టర్ సాయంతో పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా తొలగించి శుభ్రం చేశారు.

నేడు కాళేశ్వరంలో కౌముది పూజ

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కొజగిరి పౌర్ణమి పురస్కరించుకొని బుధవారం రాత్రి కాళేశ్వరాలయంలో కౌముది పూజ నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మారుతి తెలిపారు. రాత్రి సమయంలో ప్రత్యేక తాంబూలంలో ఏర్పాటు చేసిన క్షీరానికి అర్చకులు విశేష పూజలు నిర్వహించి, పాలల్లో చంద్రుని ప్రతిబింబాన్ని భక్తులు తిలకించేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సింగరేణి ఏరియా సెక్యూరిటీ అధికారిగా మురళీమోహన్



భూపాలపల్లి, న్యూస్‌టుడే : భూపాలపల్లి సింగరేణి ఏరియా సెక్యూరిటీ అధికారిగా సిల్వేరి మురళీ మోహన్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన సెక్యూరిటీ అధికారి రవి శ్రీరాంపూర్ ఏరియా ఓసీ-2కు బదిలీపై వెళ్లగా ఈయన స్థానంలో శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తున్న సిల్వేరి మురళీ మోహన్ భూపాలపల్లి డివిజన్‌కు బదిలీపై వచ్చారు. ఆయన స్థానిక సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



చిట్యాల ఆదర్శ పాఠశాలలో..



మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

చిట్యాల, న్యూస్‌టుడే : మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కాకతీయ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ రమేశ్, కరస్పాండెంట్ రాజ్ మహమ్మద్‌లు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, వెంకటేశ్వర్లు, ధనలక్ష్మీ, వాణి, సమీరా నిషాత్, జ్యోష్నాదేవి, ఆయేషా, రాజు పాల్గొన్నారు.

మహదేవపూర్ : మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు రమేష్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఓటు నమోదు చేసుకోండి



మొగుళ్లపల్లి : ఎమ్మెల్సీ ఓటరు నమోదులో ఉపాధ్యాయులు



చిట్యాలలో ఓటు నమోదును ప్రారంభిస్తున్న ఎంఈవో రఘుపతి

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : అర్హతగల ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ నవంబరు 6న ముగుస్తున్నందున ఆలోపు ప్రతి ఉపాధ్యాయుడు స్వచ్ఛందంగా ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలు నాగరాజు, గడ్డం అనిల్‌కుమార్, కృష్ణారెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

చిట్యాల : రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఉపాధ్యాయులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో చేపట్టిన టీచర్స్ ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదు కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతితో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు నమోదు చేసుకోవడంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించుకోవడానికి అందరూ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సాంబమూర్తి, రామ్‌నారాయణ, శ్రీనివాస్, సుజాత, రఘుపతి, రాజమౌళి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జైలు

కాటారం, న్యూస్‌టుడే : మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి భూపాలపల్లి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ రాంచందర్‌రావు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఎం.అభినవ్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రం పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం తాగి వాహనం నడుపుతూ మహాముత్తారం మండలం కనుకునూరు గ్రామానికి చెందిన రేగ నాగభూషణ్, కాటారానికి చెందిన బొడ్డు శ్రీధర్ పట్టుబడినట్లు పేర్కొన్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా నాగభూషణ్‌కు రెండు రోజులు, శ్రీధర్‌కు నాలుగు రోజుల జైలు శిక్ష, ఇరువురికి రూ.వెయ్యి చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించినట్లు తెలిపారు. వీరిద్దరిని పరకాల సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చరవాణుల అప్పగింత



చిట్యాల, న్యూస్‌టుడే : చోరీకి గురైన రెండు చరవాణులను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన పోలీసులు తిరిగి బాధితులకు అప్పగించారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన టేకు లక్ష్మయ్య, ముచినిపర్తి గ్రామానికి చెందిన గుండెవేటి రాజిరెడ్డిలు తమ చరవాణులు చోరీకి గురవడంతో ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తు చేశారు. చరవాణులను గుర్తించి మంగళవారం బాధితులకు అప్పగించారు. గత పది రోజుల్లో 5 చరవాణులను గుర్తించి బాధితులకు అప్పగించినట్లు వివరించారు. వీటిని గుర్తించడంలో కీలకపాత్ర పోషించిన కానిస్టేబుళ్లు కోమల, మమత, లాల్‌సింగ్‌లను ఎస్సై అభినందించారు.

రెస్టారెంట్ యజమానిపై ఫిర్యాదు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ఓ రెస్టారెంట్ యజమానిపై జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరం మాజీ ఎంపీటీసీ సభ్యురాలు రేవెళ్లి మమత నాగరాజు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 14న భోజనం చేయడానికి రెస్టారెంట్‌కు వెళ్తే కుళ్లిపోయిన 'సూప్' ఇచ్చారని, అది వాసన రావడంతో వెంటనే మరో సూప్ తీసుకురావాలని రెస్టారెంట్ సిబ్బందిని అడిగితే వారు దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తక్షణమే విచారించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

మల్హర్, న్యూస్‌టుడే : ప్రజల ఆరోగ్యాన్ని హరించే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కొయ్యూర్‌లో మంగళవారం రాత్రి నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. అనుమతి పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటుపడి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని అన్నారు. సెల్‌ఫోన్లకు అనుమానిత సందేశాలు వస్తే తెరిచిచూడవద్దని తెలిపారు. నాటుసారా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ నాగార్జునరావు, ఎస్సై నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశాల గడువు పొడిగింపు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీ ప్రాంతంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఆరు కొత్త కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 19 వరకు పొడిగించినట్లు స్థానిక ఐటీఐ ప్రిన్సిపల్ జుమ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 19 వరకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 89851 00563 నంబరును సంప్రదించవచ్చని చెప్పారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెల మృతి

గణపురం, న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని మోరంచవాగు సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపురానికి చెందిన కొమురయ్య పాడి గేదె మోరంచవాగు వద్ద పశుగ్రాసం మేస్తుండగా విద్యుత్తు తీగ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది.. ప్రభుత్వం తరుపున ఆర్థిక సహాయం అందించాలని బాధిత రైతు కోరారు.

☛ **భూపాలపల్లి మండలంలో :** భూపాలపల్లి మండలం మోరంచపల్లిలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బిల్ల వాసుదేవరెడ్డి పాడి గేదె గ్రామంలో పశుగ్రాసం కోసం వెళ్లగా నియంత్రిక వద్ద ఏర్పాటు చేసిన తీగ తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకా



చెల్పూర్, న్యూస్‌టుడే : పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ కుమారస్వామి అన్నారు. మంగళవారం గణపురం మండలం చెల్పూర్‌లో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్‌లో మొదటి విడత టీకాలు వేసిన అధికారులు మంగళవారం నుంచి రెండో విడత టీకాలకు సిద్ధమయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి పాల్గొన్నారు.

మహదేవపూర్ : పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలను సకాలంలో వేయించాలని మహదేవపూర్ మండల పశువైద్యాధికారి రాజబాపు తెలిపారు. మంగళవారం నుంచి నవంబర్ 15వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

పాఠశాల భవనం కూల్చివేతపై విచారణకు డిమాండ్

కాటారం, న్యూస్‌టుడే : చిదినెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పాత భవనాన్ని నిబంధనలు పాటించకుండా అక్రమంగా కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్ అన్నారు. మంగళవారం పాఠశాలను గ్రామస్థులతో కలిసి సందర్శించి వివరాలు ఆరా తీశారు. కమిటీ అనుమతులు, నిబంధనలు పాటించకుండా పాఠశాల ప్రిన్సిపల్ భవనాన్ని కూల్చివేయించి పాఠశాల సామగ్రిని వేలం వేశారని ఆరోపించారు. సందర్శనకు వచ్చిన ఎంఈవో శ్రీదేవికి ఫిర్యాదు చేసి పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సంక్షిప్తంగా

19న జాతర వేలం పాటలు

రేగొండ, న్యూస్‌టుడే : తిర్మలగిరి గ్రామంలో ఈ నెల 19న బుగులోని వేంకటేశ్వరస్వామి జాతరకు సంబంధించి వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈవో మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 14 నుంచి 18 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. జాతరలో భక్తులు విక్రయించే లడ్డూ ప్రసాదం, కొబ్బరికాయలు, పుట్నాలు, వంటి వాటికి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిందితులను శిక్షించాలి

చిట్యాల, న్యూస్‌టుడే : వరంగల్ జిల్లాలో మహాత్మా జ్యోతిబా పులే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా సాంస్కృతిక కార్యదర్శి జన్నె యుగంధర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోల్కొండ సురేశ్, బొడ్డు ప్రభాకర్ పాల్గొన్నారు.

'ఇసుక లారీలకు ప్రవేశ రుసుం లేదు'

కాళేశ్వరం, న్యూస్‌టుడే : మండలంలోని మద్దులపల్లి పంచాయతీ పరిధిలోని ఇసుక రీచ్‌లకు వచ్చే లారీలకు ఎటువంటి ప్రవేశ రుసుం తీసుకోవడం లేదని గ్రామ పంచాయతీ ప్రకటించింది. పంచాయతీ పేరు చెప్పి ప్రవేశ రుసుం వసూలు చేస్తున్నారని ఆరోపణలు రావడంతో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక నింపుకునే లారీలు నేరుగా రీచ్‌ల వద్దకు వెళ్లే వీలుందన్నారు. రుసుం పేరుతో ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే పంచాయతీ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కార్యదర్శి తెలిపారు.

మైక్‌సెట్ బహూకరణ

టేకుమట్ల, న్యూస్‌టుడే : వెంకట్రావ్‌పల్లి ఉన్నత పాఠశాలలో చదువుకొని పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకు గుర్తుగా గత విద్యా సంవత్సర విద్యార్థులు పాఠశాలకు మైక్‌సెట్ బహూకరించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల హెచ్‌ఎం రమేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వుప్పుల రవీందర్, అనంతుల రాజు, ఆకారపు భూజేంద్రాచారి, సుధాకర్ పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం



బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య

భూపాలపల్లి రూరల్, న్యూస్‌టుడే : బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య అన్నారు. మంగళవారం భూపాలపల్లి మున్సిపాలిటీ సుభాష్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీడబ్ల్యూవో మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదని, మహిళలు నేడు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. ఇద్దరు ఆడపిల్లలున్న తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజనను వినియోగించుకోవాలని అన్నారు. 18 ఏళ్లలోపు ఆడపిల్లలకు ఏవైనా సమస్యలు వస్తే 1098 నంబరును ఉపయోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ అనూష, అకౌంటెంట్ సురేష్, సూపర్‌వైజర్ అరుణ, రజిత, ఛైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ తిరుపతి, కేస్ వర్కర్ కళావతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎల్‌ఆర్ఎస్ సర్వే



కాటారం, న్యూస్‌టుడే : మండలంలో లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్ఎస్) సర్వే కొనసాగుతోంది. దరఖాస్తు చేసుకున్న పలువురి ప్లాట్లను పరిశీలించి కొలతలు, హద్దులు, పత్రాలను పరిశీలించారు. ఎంపీవో వీరస్వామి ఎల్‌ఆర్ఎస్ ప్రక్రియను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శులు షగీర్‌ఖాన్, నవ్యశ్రీ, శ్రీనివాస్, నాగరాజు, రాజశేఖర్, వంశీకృష్ణ, గంగాధరన్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి ముచ్చట్లు

సంస్థ స్థితిగతులపై అవగాహన

గోదావరిఖని: సింగరేణి జీడీకే-1 గనిని మల్టీ డిపార్టుమెంటు కమిటీ మంగళవారం సందర్శించింది. అనంతరం నిర్వహించిన సమావేశంలో సంస్థ స్థితిగతులపై అవగాహన కల్పించారు. అనంతరం ఛైర్మన్ బలరాం పంపిన సందేశాత్మక వీడియోను ప్రదర్శించారు. గని ఏజెంటు, రక్షణ అధికారి, మేనేజర్లు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

యైటింక్లయిన్‌కాలనీ: ఓసీపీ-3 ప్రాజెక్టులోని భారీ యంత్రాలతో ఉత్పన్నమవుతున్న సమస్యలు, ఆపరేటర్లు పడుతున్న ఇబ్బందులపై సీఐటీయూ నాయకులు ఇచ్చిన విన్నపం మేరకు.. మంగళవారం మేనేజర్ భరత్‌కుమార్ భారీ యంత్రాలను పరిశీలించారు. సమస్యలను ఆపరేటర్లను అడిగి తెలుసుకున్నారు. జీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సంస్మరణ సభకు తరలిరండి

యైటింక్లయిన్‌కాలనీ: 2003 అక్టోబరు-17న జరిగిన గని ప్రమాదంలో 10 మంది కార్మికులు మృతిచెందగా.. వీరిని స్మరిస్తూ ఏటా సంస్మరణ సభ నిర్వహిస్తున్న సందర్భంగా జీడీకే-8ఏ గని మాజీ కార్మికులు, సంఘాల నాయకులు హాజరుకావాలని మృతుల కుటుంబసభ్యులు కోరారు. గురువారం వారి 21వ వర్ధంతిని నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాహన టెండర్లలో అన్యాయం

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): ఆర్జీ-3 ఏరియాలో వాహన టెండర్లలో భూనిర్వాసితులమైన తమకు అన్యాయం జరిగిందని నాగేపల్లికి చెందిన పొన్నం బాలకృష్ణ, మేడగొని నరెందర్ వాపోయారు. సెంటినరీకాలనీలో మంగళవారం వారు మాట్లాడుతూ.. భూనిర్వాసితులకు సింగరేణి అద్దె వాహనాలు ఏర్పాటుకు అవకాశం కల్పించిందన్నారు. ఈ ప్రక్రియను టెండర్ల పద్ధతిలో నిర్వహించగా.. కొందరు సింగరేణి అధికారులు చేతివాటం చూపుతూ తమకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ విషయంపై సింగరేణి సీఎండీ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సమాచార హక్కు చట్టం.. వజ్రాయుధం



ఆర్టీఐ ఆవిర్భావ వేడుకల్లో కేకు కోస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధం లాంటిదని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో మండల కన్వీనర్ కమలాపురం విజేందర్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై కేకు కోసి, స్థానికులకు మిఠాయి, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2005 సంవత్సరంలో చట్టం అమల్లోకి వచ్చి నేటికి 19 సంవత్సరాలు పూర్తి చేసుకొని 20వ సంవత్సరంలోకి అడుగుపెట్టిందన్నారు. ఆర్టీఐ అమలుతో సమాజంలోని ప్రతి వ్యవస్థలో మంచి మార్పు వచ్చిందన్నారు. చట్టాన్ని పదో తరగతిలో పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, కాశబోయిన రమేష్, పసరగొండ రాజేందర్, చుంచు రాజు, వీరన్న, రాజయ్య, సురేష్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలని వినతి

భూపాలపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. నాయకులు నరేష్, శంకర్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెల రోజుల్లో పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు విడుదల చేస్తామని చెప్పి.. 10 నెలలు గడిచినా ఒక్క రూపాయి విడుదల చేయలేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా విద్యార్థులకు ఉపకార వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.